RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

నిజం మా నైజం

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com

ఎడిటర్ : చింతల రామకృష్ణ సంపుటి : 13 సంచిక : 273 మంగళవారం, ఫిబ్రవరి 24 2026, పేజీలు - 8 వెల : 3/-




## తెలంగాణలో మే 11 నుంచి జూన్ 9 వరకు

# ఇళ్ల గణన

- కేబినెట్ భేటీలో వివరించిన సీఎస్
- కొనసాగుతున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం
- శాసనసభ బడ్జెట్ సమావేశాలపై మంత్రివర్గ భేటీలో చర్చ
- ధాన్యం సేకరణపైనా కేబినెట్‌లో చర్చ



**హైదరాబాద్ :** సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ కొనసాగుతోంది. మంత్రివర్గ సమావేశంలో పలు అంశాలపై చర్చిస్తున్నారు. ముఖ్యంగా శాసనసభ బడ్జెట్ సమావేశాలపై భేటీలో చర్చ జరుగుతోంది. వేసవి కాలం మొదలైనందున వచ్చే 3 నెలలపాటు తాగునీటి సరఫరా ప్రణాళికతో పాటు, ఆరోగ్యం, విద్యకు సంబంధించిన అంశాలపై కేబినెట్‌లో చర్చ జరుగుతున్నట్లు సమాచారం. 2027లో జనగణన ప్రక్రియ : కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన జనగణన 2027ను చేపట్టేందుకు రాష్ట్రంలో ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లపై మంత్రివర్గం చర్చించినట్లు సమాచారం. రెండో దశ జనగణన ప్రక్రియ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో చేపడుతారు. నిర్ణిత షెడ్యూల్ ప్రకారం తొలి విడత జరిగే ఇండ్ల గణన (హౌజ్ లిస్టింగ్ ఆపరేషన్) రాష్ట్రంలో మే 11వ తేదీన ప్రారంభించి జూన్ 9 వరకు చేపట్టే ందుకు ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ సెక్రెటరీ రామ కృష్ణరావు వివరించారు. హౌజ్ లిస్టింగ్?కు కేంద్రం నిర్దేశించిన 34 ప్రశ్నల నమూనాను వివరించారు. రాష్ట్రంలో ఎన్యుమరేటర్లతో పాటు నోడల్ ఆఫీసర్లు మొత్తం 89 వేల మంది ఉద్యోగులు జన గణన ప్రక్రియలో పాలుపంచుకుంటారు.పలు అంశాలపై చర్చ : భూసేకరణ, భూముల కేటాయింపులు, ఉద్యోగాల భర్తీ, రైతు భరోసా నిధుల విడుదలపై కూడా కేబినెట్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. 5 సాగునీటి ప్రాజెక్టులకు సవరించిన అంచనాలపై చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగుల ఆరోగ్య పథకం, యంగ్ ఇండియా స్కూళ్లకు భూముల కేటాయింపుపై, ధాన్యం సేకరణపైనా కేబినెట్‌లో చర్చించనున్నట్లు సమాచారం.

### నా పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకూ

## అనుమతి లేదు



**హైదరాబాద్, ఫిబ్రవరి 23 :** తన పేరుతో ఎలాంటి సంస్థల నిర్వహణకూ అనుమతి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు స్పష్టం చేశారు. తన పేరుతో కొంతమంది సంస్థలు ఏర్పాటు చేసిన విషయంపై ఆయన స్పందించారు. ఎవరైనా పనిచేయాలనుకుంటే బీఆర్ఎస్‌తో కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేటీఆర్ ఓ ప్రకటన విడుదల చేశారు. 'కేటీఆర్ సేవా సమితి', 'కేటీఆర్ సేన'.. పేరుతో కార్యకలాపాలు చేపట్టవద్దని చెప్పారు.తన పేరుతో ఎలాంటి సంస్థలకూ అనుమతి లేదని.. అలాంటి ప్రయత్నా లను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించబోమని కేటీఆర్ స్పష్టం చేశారు. ఇలాంటి సంస్థలకు ఎటువంటి గుర్తింపు, అనుమతి లేదనే విషయాన్ని అందరూ గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా పనిచేయాలనుకుంటే ఖచ్చితంగా భారత రాష్ట్ర సమితి పరిధిలోనే పనిచేయాల్సి ఉంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. తన పేరుతో పలు సంస్థల ద్వారా చేస్తున్న కార్యక్రమాలను ఆపేయాలని.. తనపై అభిమానం ఉన్నవాళ్లు భారత రాష్ట్ర సమితితో కలిసి పని చేయొచ్చని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు

### స్వర్ణాంధ్ర 2047 విజన్‌తో తలసరి

## ఆదాయం భారీగా పెంపు



**అమరావతి, ఫిబ్రవరి 23 :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుఅసెంబ్లీలో (సోమవారం) సంక్షేమ బడ్జెట్ కేటాయింపులపై చర్చించారు. సామాజిక సమానత్వం అనే లక్ష్యం కోసం ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని వ్యాఖ్యానించారు. రాజకీయంగా కూడా వెనకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. సంక్షేమం విషయంలో సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ చేశామని ఉద్ఘాటించారు. ఆటో కార్మికులు, మత్స్యకారులు, చేనేతలకు కూడా మేలు చేశామని తెలిపారు.సాంకేతికత సాయం తీసుకున్నాం..నిత్యావసర సరకులు కూడా సక్రమంగా అందించేలా సాంకేతికత సాయం తీసుకున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం ఎక్కువ కేటాయింపులు చేశామని చెప్పుకొచ్చారు. బడ్జెట్ కేటాయింపులు అమలు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తామని వివరించారు. స్వర్ణాంధ్ర - 2047 విజన్‌లో భాగంగా తలసరి ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.54 లక్షలకు పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భావితరాల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. అంగన్‌వాడీ నుంచి స్కూళ్లు, కాలేజీల వరకూ మంచి విద్య, వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. పేద వర్గాల ఆదాయం పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించామని సీఎం చెప్పారు.పీ4 ద్వారా ఆర్థిక అసమానతల తొలగింపు..పీ4 ద్వారా ఆర్థిక అసమానతలు తొలగించటానికి చర్యలు తీసుకుంటున్నామని చంద్రబాబు తెలిపారు. 10 లక్షల బంగారు కుటుంబాలను లక్షమంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని వివరించారు. 'నిరంతరం పర్యవేక్షిస్తేనే ఏ కార్యక్రమమైనా ఫలితాలనిస్తుంది. అట్టడుగున ఉన్న పేదవర్గాలనూ ఆదుకునేలా పీ4 ప్రణాళికలు ఉన్నాయి.

## సుప్రీంకోర్టులో గౌరవెల్లి ప్రాజెక్ట్ కేసు గెలుస్తాం



**హైదరాబాద్, ఫిబ్రవరి 23 :** గౌరవెల్లి ప్రాజెక్టు.. అనేక కారణాలు, లీగల్ సమస్యల వల్ల ఆలస్యం అవుతుందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి(౧వశ్రీఖఅస్త్రుఖఋ వీఱఅఱర్‌వతీ ఖ్షుఎ ఖబఋఖుతీ =వ఻఻ఎ) వ్యాఖ్యానించారు. ఈ ప్రాజెక్టుపై మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్.. సచివాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ ప్రాజెక్టు కాలువల భూసేకరణ పూర్తి చేసి పనులు వేగవంతం చేసేలా సమీక్షా సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పొన్నం ప్రభాకర్ గౌరవెల్లి ప్రాజెక్టు కోసం తమ మీద ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిపారు. సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ మూడు జిల్లాల కలెక్టర్‌లు, రాష్ట్ర అడ్వకేట్ జనరల్, ఇరిగేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించామని అన్నారు.లీగల్ ఇబ్బందులపై చర్చ..గౌరవెల్లి ప్రాజెక్టులో లీగల్ ఇబ్బందులు ఎలా క్లియర్ చేయాలో చర్చించామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు భూసేకరణ, పనుల వేగవంతంపై ఎలా ముందుకు వెళ్లాలో చర్చించామన్నారు. భూసేకరణ విషయంలో హామీ ఇచ్చామని తెలిపారు. సంబంధిత నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చామని అన్నారు. ఈ మేరకు బుధవారం నాడు సుప్రీంకోర్టులో ఈ ప్రాజెక్టు కేసు విచారణ ఉందని ప్రస్తావించారు. సర్వోన్నత న్యాయస్థానంలో ఎన్వీరాన్‌మెంట్ కేసు గెలుస్తామనే విశ్వాసం తమకుందన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టును అన్ని విధాలుగా పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దేవాదుల ప్రాజెక్టు నీళ్లు హుస్నాబాద్ నియోజకవర్గానికి రావడానికి కావల్సిన పెండింగ్ పనులు పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్, కరీంనగర్, సిద్దిపేట, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు, ఇరిగేషన్ అధికారులు, ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో వాతావరణ మార్పులు

**- రాబోయే మూడు రోజులు వర్ష సూచన!**




**హైదరాబాద్ :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అటు ఆంధ్రప్ర దేశ్, ఇటు తెలంగాణలో కొన్ని చోట్ల ఎండలు మండుతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై వర్షాలు కురుసు_న్నాయి. అమరావతి మరియు హైదరాబాద్ వాతావరణ కేంద్రాల తాజా సమాచారం ప్రకారం, ఫిబ్రవరి 23 నుంచి రాబోయే మూడు రోజుల పాటు రెండు రాష్ట్రాల్లో వర్షాలు పడే అవకాశం ఉంది.

### బంగాల్‌లో అధికార మార్పు తీసుకురావాలి

## ఆ రాష్ట్ర ప్రజలకు మోదీ లేఖ



**న్యూ ఢిల్లీ :** మరికొద్ది నెలల్లో బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బంగాల్‌లో అధికార మార్పు తీసుకురావాలని (ప్రభుత్వాన్ని మార్చాలని) ప్రజలను కోరారు. బంగాల్‌ను 'సోనార్ బంగ్లా'గా మారుస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు బంగాల్ ప్రజలకు నరేంద్ర మోదీ సోమవారం లేఖ రాశారు. ఈ లెటర్లను బీజేపీ కార్యకర్తలు రాష్ట్ర ప్రజలకు అందించనున్నారు."మరికొద్ది నెలల్లో బంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తాయి. రానున్న తరం భవిష్యత్తు మీరు బాగా ఆలోచించి తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. నేడు 'సోనార్ బంగ్లా' గురించి కలలు కనే ప్రతి యువకుడు, వృద్ధుడు, మహిళలు చాలా బాధలో ఉన్నారు. వారి బాధ నా హృదయాన్ని తాకింది. అందువల్ల నేను నా గుండె లోతుల్లో నుంచి ఒక తీర్మానం చేస్తున్నాను. బంగాల్‌ను వికసిత్ (అభివృద్ధి చెందిన), సంపన్నమైన రాష్ట్రంగా మార్చాలనేది నా సంకల్పం" అని మోదీ లేఖలో పేర్కొన్నారు.టీఎంసీపై విమర్శలుగత 11 ఏళ్లుగా దేశ ప్రజల ఆశీర్వాద బలంతో తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. రైతుల సంక్షేమం నుంచి యువత కలలను నెరవేర్చడం వరకు, మహిళలను సాధికారపరచడం నుంచి సమాజంలోని ప్రతి వర్గాన్ని చేరుకోవడం వరకు తమ ప్రభుత్వ విధానాలు, నిరంతర ప్రయత్నాల సానుకూల ఫలితాలు నేడు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. ఈ క్రమంలో బంగాల్‌లో అధికారంలో ఉన్న టీఎంసీ సర్కార్‌పై మోదీ మండిపడ్డారు."బంగాల్ ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేకపోయినా రాష్ట్రంలో దాదాపు 5 కోట్ల మంది ప్రజల చేత 'జన్ ధన్ యోజన' ఖాతాలు ఓపెన్ చేయించాం. 'స్వచ్ఛ భారత్ అభియాన్' కింద రాష్ట్రంలో 85 లక్షల మరుగుదొడ్లు నిర్మించాం. బంగాల్‌ను పాలిస్తున్న టీఎంసీ సర్కార్ పేదల జీవనోపాధిని లాక్కుంటోంది. మేము మాత్రం చిరు వ్యాపారులు, వ్యవస్థాపకులకు రూ.2.82 లక్షల కోట్ల విలువైన రుణాలు అందించాం. 'అటల్ పెన్షన్ యోజన' కింద 56 లక్షల మంది సీనియర్ సిటిజెన్స్‌కు ఊరట కల్పించాం. 'ఉజ్వల యోజన' ద్వారా కోటి కుటుంబాలకు ఎల్‌పీజీ కనెక్షన్‌లను అందించాం. తద్వారా మాతృమూర్తులు, సోదరీమణులను పొగ నుంచి విముక్తి కల్పించాం."

## అనాథలకు ఉపాధి కల్పన

### తెలంగాణ ప్రభుత్వం కీలక ఒప్పందాలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 23 :** అనాథ పిల్లల ఉద్యోగ కల్పనపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అథారిటీ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీతో (ఫిక్కీ) తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఒప్పందాలు కుదుర్చుకుంది. తెలంగాణ సచివాలయంలో మంత్రి సీతక్క సమక్షంలో కీలక ఒప్పందాలు జరిగాయి. ప్రభుత్వ సంరక్షణలో ఉన్న అనాథ యువతకు విమానయాన రంగంలో నైపుణ్య శిక్షణ కల్పన దిశలో ఒప్పందాలు జరిగాయి. ఎయిర్‌పోర్టు ఆపరేషన్, కార్గో, గ్రౌండ్ హ్యాడ్లింగ్ వంటి కోర్సుల్లో దశల వారీగా శిక్షణ ఇవ్వనున్నాయి.ఈ శిక్షణ ద్వారా అనాథ యువతకు ప్రైవేట్, అంతర్జాతీయ స్థాయి విమానయాన సంస్థల్లో ఉద్యోగాలు కల్పించనున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని 2026 మార్చి నుంచి శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరో అకాడమీలో ప్రారంభించనున్నారు. ప్రభుత్వ సంరక్షణలో, శక్తి సథన్‌లో ఉంటున్న అనాథ యువతకు ఉద్యోగ అవకాశాల లక్షంగా శిక్షణ ఇవ్వనున్నారు.పాలిటెక్నిక్ చదువుతున్న అనాథ అమ్మాయిలకు ఫిక్కి నిర్వాహకులు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నారు. చదువుకునే కాలంలోనే ఇండ్రస్ట్రీ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారు. అంగన్వాడీ టీచర్లకు ఫ్రీ స్కూల్ ట్రైనింగ్ శిక్షణ కోసం అజీమ్ ప్రెమ్జీ యునివర్సిటీతో ఒప్పందం చేసుకున్నారు. అంగన్వాడీ టీచర్లకు ఇంగ్లిష్‌పై శిక్షణ, పాలన కేంద్రాల్లో చిన్నారులకు అందిచాల్సిన సేవలపై శిక్షణని అజీమ్ ప్రెమ్జీ యునివర్సిటీ ఇవ్వనుంది.

## 'అవినీతి నిరూపిస్తే రాజీనామా చేస్తా'

### షబ్బీర్ అలీకి ఎమ్మెల్యే కాటిపల్లి సవాల్!



**కామారెడ్డి జిల్లా :** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భూముల వ్యవహారంపై రాజకీయ యుద్ధం ముదిరింది. తనపై వస్తున్న అవినీతి ఆరోపణలను నిరూపిస్తే తక్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీకి సవాల్ విసిరారు. ఈ వివాదానికి సంబంధించి వాస్తవాలను వెలికితీయాలని కోరుతూ ఆయన సోమవారం కామారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.నిజాలు బయటపెట్టాలని కలెక్టర్‌కు వినతిడిగ్రీ కళాశాల భూములకు సంబంధించిన పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. కాలేజీ భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారన్న ఆరోపణల్లో వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు.ఈ భూముల వ్యవహారంపై ప్రభుత్వం వద్ద ఉన్న రికార్డులను ఇవ్వాలని ఇపటికే ఆర్టీఐ ద్వారా కోరినట్లు వెల్లడించారు.డిగ్రీ కళాశాల భూముల విషయంలో నేను ఒక్క గజం భూమినైనా అక్రమించినట్లు లేదా అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవిని వదులుకుంటాను అని ఆయన ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయ లబ్ధి కోసమే సత్యదూరమైన ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు.పోలీసుల తీరుపై ఆగ్రహంకామారెడ్డిలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసుల వ్యవహారశైలిపై ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు.తనను కలవడానికి వస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులను పోలీసులు అక్రమంగా అడ్డుకుంటున్నారని, అదే సమయంలో కాంగ్రెస్ నాయకులను ఎందుకు వదిలేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.నియోజకవర్గంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకూడదనే ఉద్దేశంతోనే తాను సహనంతో ఉన్నానని, కానీ ప్రభుత్వం తనపై కక్షసాధింపు చర్యలకు దిగుతోందని ఆరోపించారు.కామారెడ్డి భూ వివాదం ఇప్పుడు రాష్ట్రస్థాయిలో చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే కలెక్టర్‌ను కలవడంతో ఈ వ్యవహారంపై అధికార యంత్రాంగం ఏ విధంగా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. త్వరలోనే ఈ భూముల చిక్కుముడి విడిపోతుందని, ఎవరు దోషో ప్రజలకు తెలుస్తుందని కాటిపల్లి ధీమా వ్యక్తం చేశారు.

# మార్కెట్ లోకి నూతన వీ టర కార్లు.



**వస్తవతెలంగాణా డైలీ న్యూస్ /.**బోయిన్పల్లి లోని ఆటో ఫిల్ లిమిటెడ్ నెక్సా మారుతి షో రూమ్ లో ఎలక్ట్రిక్ వెహికల్ ఈ విటారా పేరుతో మార్కెట్లోకి విడుదల చేశారు. కాచిగూడ ఏసిపి వై హరీష్ కుమార్ తోపాటు మారుతి సుజుకి కమర్షియల్ బిజినెస్ హెడ్ యోగేష్ గుప్తా, షోరూం సీఈఓ హరే రామ్ సింగ్ షోరూమ్ మేనేజర్ రమణారెడ్డి జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆవిష్కరించారు. సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ543 కిలోమీటర్ల రేంజ్ తో 61 కిలోవాట్ల బ్యాటరీ నైపుణ్యంతో నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. 10 లక్షల 99 వేల రూపాయలతో ప్రారంభం కానున్న ధర వే రెంట్ ను బట్టి గరిష్ట ధరను నిర్ణయించారు. ప్రమాదలను అరికట్టే విధంగా 7 ఎయిర్ బ్యాగ్స్ ను లెవెల్ టు అడాస్, తోపాటు ప్రీమియం మ్యూజిక్ సిస్టం తో పాటు భారత్ ఎన్క్యాప్ ఫైవ్ స్టార్ సేఫ్టీ రేటింగ్ను నిర్ధారించార. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎస్డిఎం నిఖిల్, క్వాలిటీ మేనేజర్ పూజ జైన్, ఆ మేడ్చల్ షోరూమ్ మేనేజర్ రోశయ్య ఫైనాన్స్ మేనేజర్ సురేష్, తోపాటు టీం లీడర్లు సాయి వికాస్ వెంకటేష్ నగేష్ అభిలాష్ ఈ వి ఆర్ ఎం అఖిల్ తో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులకు హరీష్ రావుకు శాసనసభ్యులు చింతల్ ప్రభాకర్ బసవ డైరీ2026 అందజేశారు



**సదాశివపేట వాస్తవ తెలంగాణన్యూస్**

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణం లోని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు గౌరవనీయులు శ్రీ తన్నీరు హరీష్ రావు గారిని మరియు సంగారెడ్డి శాసనసభ్యులు శ్రీ చింతా ప్రభాకర్ అన్న మర్యాదపూర్వకంగా కలిసి విశ్వ లింగాయత్ ట్రస్ట్ అధినేత శివ శ్రీ పాసారం శ్రీనివాస్ గారు ముదిరిచ్చిన బసవ డైరీ 2026 ని అందజేయడం జరిగినది ఈ కార్యక్రమంలో సదాశివపేట మాజీ మున్సిపల్ చైర్మన్ శివరాజ్ పాటిల్ సంగారెడ్డి జిల్లా వీరశైవ లింగాయత్ సమాజా పెద్దలు శ్రీ చీల మల్లన్న గౌరవ సలహాదారులు అన్మిశెట్టి జయప్రకాష్ కార్యక్రమంలోపాల్గొన్నారు

# ఉపాధ్యాయులు అంకితభావంతో బోధించాలి మండల విద్యాధికారి శంకర్





**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లాహైదరాబాద్ ఎస్సీఈఆర్టీలో శుక్రవారం జరిగిన పప్పెట్రీ పోటీలో జిల్లా నుండి సదాశివపేట మండల ఉపాధ్యాయులు పాల్గొని ప్రతిభ చూపిన సందర్భంగా మండల విద్యాధికారి శంకర్ వారికి సోమవారం సదాశివపేటలో జరిగిన ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి మండల విద్యాధికారి మాట్లాడుతూ మండలంలోని కోనాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ మరియు నిజాంపూర్ కాలనీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సునీతలు శుక్రవారం ఎస్సీఈఆర్టీ హైదరాబాద్ లో జరిగిన పప్పెట్రీ పోటీలలో పాల్గొని ప్రతిభ చూపినారని తెలియజేశారు. జిల్లా నుండి ఎంపిక కాబడిన ముగ్గురిలో ఇద్దరూ సదాశివపేట మండలానికే చెందిన వారే కావడం విశేషం అన్నారు. కాంప్లెక్స్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన ఉపాధ్యాయులు జర్నయ్య మరియు శివకుమార్ లకు కూడా సన్మానం చేసినారు. ఈ సందర్భంగా ఎంఇఓ శంకర్ మాట్లాడుతూ మండలంలోని అందరూ ఉపాధ్యాయులు అంకిత భావంతో కష్టపడి భోదించి మండలానికి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరి, జయసుధ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్స్ అబ్దుల్ కలాం,మహేష్, పద్మ మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# క్రీడల అభివృద్ధి లక్ష్యం

**- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి**





**గుమ్మడిదల,వాస్తవ తెలంగాణ న్యూస్:** అనంతారం గ్రామంలో క్రీడాభివృద్ధికి మరో ముందడుగు పడింది. గ్రామ వాలీబాల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఫ్లడ్ లైట్స్‌ను ఆదివారం రాత్రి ప్రారంభి ంచారు. గ్రామ యువత క్రీడా ప్రతిభను ప్రోత్సహించాలనే లక్ష్యం తో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తన సొంత నిధులతో ఫ్లడ్ లైట్స్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కొమ్ము శ్రీను ప్రారంభించారు. ఈ సందర్భంగా చిమ్ముల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు సరైన వసతులు కల్పించడం అత్యంత అవసరమని, రాత్రి వేళల్లో కూడా క్రీడలకు ఈ ఫ్లడ్ లైట్స్ ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. క్రీడల ద్వారా యువత ఆరోగ్యవంతంగా ఉండడమే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. సర్పంచ్ కొమ్ము శ్రీను మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న చిమ్ముల గోవర్ధన్ రెడ్డికి గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ వాలీబాల్ గ్రౌండ్ ఫ్లడ్ లైట్స్ వల్ల గ్రామ యువతలో మరింత ఉత్సాహం పెరిగి క్రీడా రంగంలో కొత్త విజయాలు సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, సిజిఆర్ ట్రస్ట్ వైస్ చైర్మన్ చిమ్ముల నరేందర్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, ఉప సర్పంచ్ యాదిరెడ్డి, గోపాల్, సాయి రెడ్డి, భాస్కర్ గౌడ్, మహేష్ యాదవ్, లక్ష్మణ్, రమణ, భాస్కర్, యాదగిరి, నర్సింగారావు, ప్రవీణ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# రాబోయే ఐదేళ్లపాటు ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చెయ్యండి: ఎమ్మెల్యే జిఎంఆర్








**గుమ్మడిదల, వాస్తవ తెలంగాణ న్యూస్:**
సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం గుమ్మడిదల మున్సిపాలిటీ తొలి మున్సిపల్ పాలకవర్గం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రాబోయే ఐదేళ్లపాటు ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని పాలకవర్గానికి సూచించారు. నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం 15 కోట్ల రూపాయల చొప్పున నిధులు మంజూరు చేయడం జరిగిందని..అతి త్వరలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రజల న్మకాన్ని వమ్ము చేయకుండా.. నిరంతరం వారికి అందుబాటులో ఉంటూ వారి నమ్మకాన్ని చూరగొనాలని కోరారు.హాజరైన ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, కమిషనర్ దశరథ్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిన్నారం సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**- ఘన స్వాగతం పలికిన బిఆర్ఎస్ శ్రేణులు**









**జిన్నారం,వాస్తవ తెలంగాణ న్యూస్:**
జిన్నారం మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డు సమగ్ర అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం జిన్నారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పురపాలక సంఘం తొలి పాలకవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక బిఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే జిఎంఆర్ కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండల పరిషత్ గా ఉన్న జిన్నారం నేడు మున్సిపల్ గా మారడం జరిగిందని.. ఇందుకు అనుగుణంగా ప్రతి వార్డు అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మున్సిపాలిటీల అభివృద్ధి కోసం 15 కోట్ల రూపాయల చొప్పున నిధులు సిద్ధంగా ఉన్నాయని.. అతి త్వరలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయబోతున్నట్లు తెలిపారు.ఎన్నికల సమయంలోనే రాజకీయాలు మాట్లాడాలని.. తదనంతరం ప్రజాసేవ లక్ష్యంగా పనిచేయాలని ప్రజాప్రతితులకు సూచించారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ.. మున్సిపాలిటీని అభివృద్ధికి ప్రత్యేకగా తీర్చిదిద్దాలని విన్నవించారు. అభివృద్ధి పనులు.. సమస్యల పరిష్కార అంశంలో తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం పాలకవర్గం సభ్యులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, కమిషనర్ తిరుపతి, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మేడ్చల్ లో షీలా ఫోం యూనియన్ జరనల్ బాడీ సమావేశం

**మేడ్చల్ వాస్తవ తెలంగాణ**
మేడ్చల్ ప్రాంతంలోని కార్మికులకు ఎక్కడ సమస్య వచ్చినా బీ ఆర్ టి యు ముందుండి పరిష్కరిస్తుందని లేబర్ బోర్డు మాజీ చైర్మన్ పి.నారాయణ అన్నారు. మేడ్చల్ పట్టణంలో షీలా ఫోం కార్మికుల జనరల్ బాడీ సమావేశం బీ ఆర్ టి యు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్ ఆద్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పి.నారాయణ మాట్లాడుతూ షీలా ఫోం కెపేనీలో గతంలో యూనియన్ స్థాపించడమే కాకుండా యాజమాన్యంతో మాట్లాడి కార్మికులకు మంచి వేతనాలు అందించేలా ఒప్పందం చేయడం జరిగిందని తెలిపారు. ఇలా ఎన్నో సమస్యలు పరిష్కరించామన్నారు. ప్రస్తుతం 2వ వేతన ఒప్పందం కూడా విజయవంతం చేసి తీరుతామని తెలిపారు. కార్మికులు ఐఖ్యమత్యంతో ఉండాలని, కార్మికులందరికి అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ టి యు మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సంబు ప్రభాకర్, యూనియన్ జనరల్ సెక్రటరీ సిరాజుద్దిన్, శ్రీనాధ్, బూమునాయుడు, స్మరణ్ కుమార్, రమేష్, కుమార్, జయ, జ్యోతి, లంక ఎర్రయ్య, షీలా ఫోం కార్మికులు పాల్గొన్నారు.



# ఆదర్శవంతమైన పాలననుఅందించండి : ఎమ్మెల్యే జిఎంఆర్





**జిన్నారం,వాస్తవ తెలంగాణ న్యూస్:** సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం గడ్డ పోతారం మున్సిపాలిటీ తొలి మున్సిపల్ పాలకవర్గం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజలకు సేవ చేసే అవకాశం అతి కొద్ది మందికే లభిస్తుందని..ప్రజలు అందించిన ఈ అవకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రాబోయే ఐదేళ్లపాటు ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని పాలకవర్గానికి సూచించారు. నియోజకవర్గంలోని ఐదు మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం 15 కోట్ల రూపాయల చొప్పున నిధులు మంజూరు చేయడం జరిగిందని..అతి త్వరలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా.. నిరంతరం వారికి అందుబాటులో ఉంటూ వారి నమ్మకాన్ని చూరగొనాలని కోరారు.మున్సిపల్ పరిధిలో గల హెట్రో పరిశ్రమ యాజమాన్యం ప్రభుత్వ అనుమతులు లేకుండా 12 ఎకరాల్లో నిర్మాణాలు చేస్తోందని..వెంటనే తొలగించేలా కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేయాలని సూచించారు. ఎమ్మెల్యే సూచనలకు అనుగుణంగా కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేశారు. హాజరైన ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ గద్దె సుష్మా, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, కమిషనర్ వెంకటరామయ్య, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తారా కళాశాలలో జిల్లాస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్




**సదాశివపేట వాస్తవ తెలంగాణ న్యూస్** సంగారెడ్డి జిల్లాతారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో ఎన్.ఎస్.ఎస్. ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ పూర్తి సహకారంతో జిల్లా స్థాయి వికసిద్భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని ఈనెల 27వ తేదీ నాడు కళాశాలలో నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపినారు.కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్, తారా ప్రభుత్వ కళాశాలలో 50 ఇయర్స్ ఆఫ్ ఎమర్జెన్సీ – లెసన్స్ ఫర్ ఇండియన్ డెమోక్రసీ అనే అంశంపై ఈనెల 27వ తేదీ నాడు జిల్లాస్థాయి వికసిత్తు భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపినారు. ఈ కార్యక్రమములో 18 సంవత్సరాల నుండి 25 సంవత్సరాల లోపు యువత ఎవరైనా పాల్గొనటకు అర్హులని, పై అంశముపై పాల్గొనదలచిన యువత మై భారత్ పోర్టల్ లో తారా కళాశాల పేరుతో నమోదై, మూడు నిమిషాల నిడివిగల వీడియోను 86882 58990 వాట్సాప్ నంబర్ కు పంపగలరు. పై అంశముపై ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషలలో దేనిలోనైనా మూడు నిమిషాలు మాట్లాడి వీడియోను ఈనెల 25 తేదీ ఉదయం 10 గంటల లోపు పంపవలసి ఉంటుంది. ఇందులో ఎంపికైన అభ్యర్థులు తారా కళాశాలలో ఈనెల 27వ తేదీన జరిగే జిల్లా స్థాయి వికసిద్భారత్ యూత్ పార్లమెంట్ ఏ2026 ప్రత్యక్షంగా పాల్గొనుటకు అర్హత పొందుతారని తెలిపినారు.జిల్లా స్థాయి యూత్ పార్లమెంటులో ఎంపికైన పదిమంది అభ్యర్థులు రాష్ట్రస్థాయికి, అక్కడ ఎంపికైన అభ్యర్థులు జాతీయస్థాయి యూత్ పార్లమెంటులో పాల్గొంటారని తెలిపినారు. కావున ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 25వ తేదీ ఉదయం 10 గంటల లోపు లోపు పై అంశముపై మూడు నిమిషాల వీడియో చేసి మరియు వికసిత్తు భారద్వారా అప్లై చేసుకుని పంపగలరని తెలిపినారు. (https://mybharat.gov.in/pages/event_detail?event_nameRViksit-Bharat-Youth-Parliament-2026-Sangareddy&keyR966135519966) ఏవైనా సందేహాలు ఉంటే 94410690 20 నంబర్ను సంప్రదించాలని కోరినారు.

# ఎల్లంపేట్ మున్సిపాలిటీ నూతనచైర్ పర్సన్ గా శ్రీదేవి రమేష్ నాయక్ పదవి బాధ్యతలు స్వీకరణ





**మేడ్చల్ వాస్తవ తెలంగాణ** ఎల్లంపేట్ మున్సిపాలిటీ నూతనచైర్ పర్సన్ గా శ్రీదేవి రమేష్ నాయక్ పదవి బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ కమిషనర్ స్వామి నాయక్ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె అధికారికంగా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా కమిషనర్ స్వామి నాయక్ చైర్మన్ శ్రీదేవి రమేష్‌కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. అనంతరం మున్సిపల్ సిబ్బంది, కౌన్సిలర్లు శుభాకాంక్షలు తెలియజేశారు. చైర్మన్ శ్రీదేవి రమేష్ మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. పారిశుధ్యం, తాగునీరు, రహదారులు వంటి ప్రాథమిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. ప్రజల సహకారంతో ఎల్లంపేట మున్సిపాలిటీని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ చామకూర మహేందర్ రెడ్డి, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ భాస్కర్ యాదవ్, మేడ్చల్ మండల మాజీ వైస్ ఎంపీపీ వెంకటేష్, మేడ్చల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దయానంద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, నాయకులు రాజమల్లారెడ్డి, మద్దుల శ్రీనివాస్ రెడ్డి, జగన్ రెడ్డి, నవీన్ రెడ్డి, మెట్టు శ్రీకాంత్ రెడ్డి, వైస్ చైర్ పర్సన్ రజిత దేవేందర్ రెడ్డి, కౌన్సిలర్లు సద్ది సురేష్ రెడ్డి, భూక్య శారద నాయక్, గుమ్మడిదల మహేశ్వరి, బందెల కుమార్, మాలోత్ రజిత, నీరుగంటి శ్రీలత రమేష్ యాదవ్, గోశిక అఖిల, దుద్దు కల్పన మాణిక్యం, దాది నరసింహా, ఓం ప్రకాష్ గౌడ్, కత్తి వరలక్ష్మి సురేందర్, చిన్నోళ్ల భాస్కర్, సద్ది నిషితా రెడ్డి వచపల్లి అర్చన, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. చామకూర మహేందర్ రెడ్డి, గ్రంథాలయ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్, చీర్ల దయానంద్, రాజ మల్లారెడ్డి, మద్దుల శ్రీనివాస్ రెడ్డి, అప్పమ్మ గారి జగన్ రెడ్డి, ఆకిటి నవీన్ రెడ్డి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రజలకు చేరువగా మండలంలో ప్రజావాణి కార్యక్రమం

**- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**





**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (ఆంజనేయులు )** ప్రజల దూర భారాన్ని, ప్రజల సమయాన్ని తగ్గించడం కోసమే మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు.సోమవారం నిజాంపేట్ మండలంలో ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. మండల కేంద్రాల్లో ప్రజావాణిని మరింత బలోపేతం చేస్తామని, ప్రజలదూర భారాన్ని, ప్రయాణ బత్యాల్ని, సమయాభావాన్ని తగ్గించడం కోసమే ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిజాంపేట ప్రజావాణిలో ప్రజల నుండి వివిధ సమస్యలపై...దరఖాస్తుల స్వీకరించినట్లు తెలిపారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని సమస్యలు పరిష్కరించి, పరిష్కారం కాని వాటిని రాతపూర్వకంగా ఫిర్యాదుదారులకు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. భూ సమస్యలన్నీ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.కోర్టు పరిధిలో, పోలీసు పరిధిలో ఉన్న వాటిని సంబంధిత శాఖలకు పంపించాలన్నారు.వచ్చిన ప్రతి దరఖాస్తును ఆన్లైన్ చేసి, వారం రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు.ప్రజలు జిల్లా కార్యాలయాల చుట్టూ తిరవలసిన అవసరం లేకుండా మండల స్థాయిలోనే వారి సమస్యలకు పరిష్కారం దొరికేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. నేటి నిజాంపేట్ ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్య అధికంగా ఉన్నందువల్ల వాటిని పరిష్కరిస్తామని పరిష్కరించని వాటిని రాతపూర్వక సమాధానం అందిస్తారని పేర్కొన్నారు. ప్రతి సోమవారం మండల స్థాయిలో ఉన్న అధికారులందరూ అది తూచా తప్పకుండా ప్రజావాణి కార్యక్రమంలో హాజర అవ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తాహాసిల్దార్ శ్రీనీవాస్ ఎంపీడీవో రాజా రెడ్డి మండల స్థాయి అధికారులు, రెవిన్యూ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

# ఘటకేసర్ సర్కిల్‌లో ప్రత్యేక డ్రైవ్

**- అబాండన్డ్ వాహనాల. తొలగింపు.. డి సి వాణి రెడ్డి**





**ఘట్కేసర్ సర్కిల్ వాస్తవ తెలంగాణ న్యూస్** మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఘటకేసర్ సర్కిల్‌లో రహదారులపై నిర్లక్ష్యంగా విడిచిపెట్టబడిన, పనికిరాని మరియు వినియోగంలో లేని వాహనాల వల్ల ట్రాఫిక్కు అంతరాయం కలగడం, పారిశుధ్య సమస్యలు ఏర్పడటం, ప్రజలకు అసౌకర్యం కలగడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని డిప్యూటీ కమిషనర్ ఎ. వాణి ఆదేశాల మేరకు 8వ డివిజన్ పోచారం లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించబడింది.ఈ డ్రైవ్‌లో భాగంగా వివిధ కాలనీలు, ప్రధాన రహదారులు మరి యు అంతర్గత వీధుల్లో దీర్ఘకాలంగా నిల్వ ఉన్న అబాండన్డ్ వాహనాలను గుర్తించి వాటిని లిఫ్టింగ్ చేసి సంబంధిత యార్డుకు తరలించడం జరిగింది.రహదారులపై పనికిరాని వాహనాలను విడిచి పెట్టవద్దని, ఇటువంటి వాహనాలను స్వయంగా తొలగిం చని యజమానులపై జరిమానాలు విధించబడతాయని అధికా రులు హెచ్చరించారు.ప్రజలు తమ వాహనాలను రహదారులపై నిర్లక్ష్యంగా వదిలివేసిన, వినియోగంలో లేని వాహనాలను తొలగించి పట్టణ శుభ్రత మరియు ట్రాఫిక్ సౌకర్యానికి సహకరించాలని డిప్యూటీ కమిషనర్ ఎ. వాణి కోరారు.

# మహిళా సెక్యూరిటీ గార్డ్ కార్మికురాలికి రావలసిన వేత్తనం ఇప్పించిన

**-బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి**



**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు....** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గాంధీనగర్ ఇండస్ట్రీ ఏరియాలోని "ఎస్ ఆర్ ఎఫ్" సెక్యూరిటీ ఏజెన్సీ లో సెక్యూరిటీ గాడ్స్ గా గత కొన్ని సంవత్సరాల నుంచి పని చేస్తున్నా, మహిళా సెక్యూరిటీ సరిత కార్మికురాలు, కొన్ని అనివార్య కారణాలవల్ల డ్యూటీ మానేయడం జరిగింది... మహిళా సెక్యూరిటీ సరితకి రావలసిన గత సంవత్సరం 2025, లో సెప్టెంబర్ నెల మొత్తం వేతనం19500/–" రూపాయలు ఇవ్వాల్సి ఉండగా, ఎస్ ఆర్ ఎఫ్, సెక్యూరిటీ ఏజెన్సీ మహిళా సెక్యూరిటీ కి వేత్తనం ఇవ్వకుండా మహిళా సెక్యూరిటీ అని చూడకుండా కార్మికురాళ్ల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ పంపించేవాడు సెక్యూరిటీ కార్మికురాలికి ఏం చేయాలో అర్థం కాక ఎవరైతే మనకు న్యాయం చేస్తారో అని తోటి సెక్యూరిటీ మిత్రుల ద్వారా తెలుసుకొని, బిఆర్ టియు రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి కార్యాలయం వద్దకు వెళ్లి సెక్యూరిటీ మహిళా కార్మికురాలు కి జరిగిన అన్యాయం గురించి వివరించారు, వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవి హుటాహుటిన "ఎస్ ఆర్ ఎఫ్" సెక్యూరిటీ ఏజెన్సీ దగ్గరికి వెళ్లి మహిళ సెక్యూరిటీ సరిత కి, గత సంవత్సరం "19500" వేత్తనం రావాల్సి ఉండగా వెంటనే మాట్లాడి, కార్మికురాలు సరితకి రావాల్సిన వేత్తనం ఇప్పించడం జరిగింది... మహిళా సెక్యూరిటీ కార్మికురాలు మాట్లాడుతూ మాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు... ఈ కార్యక్రమంలో అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్ పాల్గొన్నారు..

# ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరగాలి

**- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**



వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (అంజనేయులు )

ఈ నెల 25 నుంచే జరగబోయే ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ నుంచి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ.. ఈ నెల 25 వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యనశీ 12 గంటల వరకు జరిగే ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరగాలని, ఈ సం: ఇంటర్ మొదటి సంవత్సరం లో 6309, రెండవ సం; 6025 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా 28 కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసి ఇంటర్ బోర్డు నుంచి పర్యవేక్షణ జరుగుతుందన్నారు. ఏలాంటి పేపర్ లీకేజీ లేకుండా, విద్యార్థులు కింద కూర్చొని పరీక్షలు రాయకుండా, మాల్ ప్రాక్టీస్కు అవకాశం లేకుండా, పరీక్ష అనంతరం పరీక్ష పేపర్లను పోలీస్ ఎస్కార్ట్ వాహనంతో జాగ్రత్తగా పోస్టల్ డిపార్ట్మెంట్ కు తరలించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల హాల్ టికెట్ల మీద క్యూఆర్ కోడ్ ఉపయోగించుకుని పరీక్షా కేంద్రాల అడ్రస్ ను సునాయాసంగా తెలుసుకోవచ్చు అన్నారు. పరీక్షా కేంద్రాల్లో ప్రతి హాలులో త్రాగునీరు, విద్యుత్ సరఫరా, గోడ గడియారం తప్పనిసరిగా ఉండాలన్నారు.పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, మెడికల్ కిట్టు, అత్యవసర మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలనీ సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో పరీక్షలను ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని తెలిపారు. టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ నగేష్, ఇంటర్ విద్యాధికారి మాధవి, ఇంటర్ పరీక్షల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా స్ట్రీట్ వెండర్స్ లను తొలగించిన జి హెచ్ ఎం సి, ట్రాఫిక్ పోలీస్ అధికారులు..





వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు......

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జిహెచ్ఎంసి, ట్రాఫిక్ పోలీసు అధికారులు స్ట్రీట్ వెండర్ అందరిని తొలగించడం జరుగుతుంది. 2014 స్ట్రీట్ వెండర్స్ చట్టం అమలు చేయడంలో ఏమాత్రం శ్రద్ధ చూపిస్తాలేరు. చట్టం ప్రకారం ఒక వెండర్ ని అతను పని చేసే చోటు తొలగించాలంటే ఒక నెల ముందు నోటీసు ద్వారా తెలిపి, అతడు పని చేసుకోవడానికి వేరొక చోటు చూపించి కానీ తొలగించరాదు కానీ అధికారులు చట్టాన్ని పట్టించుకోక వెండర్స్ అందరిని కూడా వాళ్ళు బండ్లను ద్వాంసం చేస్తున్నారు. ప్రధానమంత్రి పీఎం స్వానిది లోన్ కింద 10 వేల నుండి 50 వేల లోన్ తీసుకొని వాళ్ల బండ్లను కొనుక్కొని వ్యాపారం చేసుకుంటున్నారు ఈరోజు అవన్నీ కుల కొడుతున్నారు వారు ఈ లోన్ ఎలా కట్టుకోవాలి చట్టం ఎలాగు ఇంప్లిమెంట్ చేస్తలేరు కాబట్టి మన తెలంగాణలో రూల్స్ చేయడంలో కొన్ని తప్పులున్నాయి దానివల్ల యాక్ట్ సరైన పద్ధతిలో అమలు అవడం లేదు కాబట్టి రూల్స్ పక్క రాష్ట్రంలో కర్ణాటకలో మరి ఇతర రాష్ట్రంలలో రూల్స్ బాగున్నయ్ అక్కడ బాగా ఇంప్లిమెంట్ అవుతున్నాయి పక్క రాష్ట్రం రూల్స్ చూసి కొన్ని మార్పులు చేసి ఇంప్లిమెంట్ చేయాలని మేము కోరుతున్నాము. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నాస్వి ద్వారా ధర్న కార్యక్రమం చేస్తాం నాస్వి ఎగ్జిక్యూటివ్ రాష్ట్ర సభ్యులు ఐ.లక్ష్మణ్ గారు నస్వి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రంగా శాలివన్ నస్వి ఉప అధ్యక్షుడు కె జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆటోనమస్ హోదా జిల్లాకే గర్వకారణం.

**- మెదక్ జిల్లా అదనపు ఎస్పీ మహేందర్.**




వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (ఆంజనేయులు )

మెదక్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నుంచి స్వయంప్రతిపత్తి (ఆటోనమస్) హోదా మంజూరుకావడం పట్ల జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ శుభసందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ హుస్సేన్ గారి నాయకత్వంలో కళాశాల అధ్యాపక బృందం అదనపు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ స్వయంప్రతిపత్తి హోదా సాధించడం జిల్లాలో ఉన్నత విద్యాభివృద్ధికి ఒక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. యూజీసీ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా కళాశాల విద్యా నాణ్యత, పరిశోధన రంగాల్లో సాధించిన పురోగతికి ఈ హోదా నిదర్శనమని పేర్కొన్నారు. ఆటోనమస్ హోదా ద్వారా విద్యార్థులకు కాలానుగుణంగా పాఠ్యాంశాల రూపకల్పన, నూతన కోర్సుల ప్రవేశం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల అమలు వంటి అంశాల్లో కళాశాలకు మరింత స్వేచ్ఛ లభిస్తుందని తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపు, పరిశోధన అభివృద్ధి, విద్యార్థుల భవిష్యత్తు కోసం కళాశాల అధ్యాపక బృందం నిరంతరం చేసిన కృషి అభినందనీయమని అదనపు ఎస్పీ పేర్కొన్నారుఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ హుస్సేన్ గారితో పాటు ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ తిరుమలరెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ శరత్ రెడ్డి, సిఎస్ఆర్ ఫండ్ కోఆర్డినేటర్ డాక్టర్ నాగేందర్ రావు, గణిత శాస్త్ర విభాగాధిపతి పి. వెంకటేశ్వర్లు సహా అధ్యాపకులను అదనపు ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# కుమ్మెర గ్రామ ఘటనపై రవి రాజ్ రాథోడ్ తీవ్ర ఖండన

**- పసిపాప మృతికి బాధ్యుల అరెస్టు కావాలి..**

**- అణగారినా వర్గాలపై ఎన్నాళ్ళీ ఈ అణిచివేత... రవి రాజ్ రాథోడ్**





కాప్ర మండలం వాస్తవ తెలంగాణ న్యూస్)

మేడ్చల్ జిల్లా కాప్ర మండలం రవి రాజ్ రాథోడ్ నాగర్కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మూడు రోజుల క్రితం చోటుచేసుకున్న అమానుష ఘటనపై తీవ్రంగా మండిపడ్డారు.రాష్ట్రవ్యాప్తంగా ఈ ఘటన పై తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. టికెట్ లేకుండా గుడిలోకి ప్రవేశించారన్న కారణంతో బి సి చాకలి కులానికి చెందిన గణేష్, చంద్రకళ, మౌనికలపై అదే గ్రామానికి చెందిన సర్పంచ్ తుకారాం రెడ్డి, సతీష్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, మధు రెడ్డి తదితర రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తులు అత్యంత దురహంకారంతో, కిరాతకంగా దాడి చేసిరు.బాధితులపై చెప్పలేని భాషలో బూతులు తిడుతూ, అసభ్య దూషణలకు పాల్పడి, మహిళలను కూడా కనికరం లేకుండా కొట్టారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ దాడిలో హద్దులు దాటి ప్రవర్తించిన నిందితులు, కేవలం రెండునెలల పసిపాపను కాళ్లతో తన్ని చంపినట్లు కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఈ ఘటన ఘటనపైమానవత్వానికే మచ్చగా మారిందని రవి రాజ్ రాథోడ్ ఆవేదన వ్యక్తం చేసారు.

టికెట్ లేకపోయిందన్న కారణంతో ఒక బి సి కుటుంబంపై దాడి చేసి, మహిళలను కొట్టి, పసిపాప ప్రాణాలు తీసిన ఈ ఘటనను నాగరిక సమాజం సహించదని రవి రాజ్ రాథోడ్ స్పష్టం చేశారు.పసిపాప మృతికి కారణమైన నిందితులందరినీ వెంటనే అరెస్టు చేయాలని, వారిపై కఠినమైన సెక్షన్లతో కేసులు నమోదు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరగే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారుఈ ఘటన ముఖ్యమంత్రి జిల్లా పరిధిలో జరిగినందున రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే జోక్యం చేసుకొని, జిల్లా యంత్రాంగానికి కఠిన ఆదేశాలు ఇవ్వాలని రవి రాజ్ రాథోడ్ డిమాండ్ చేశారుబాధితులకు రక్షణ, వైద్యం, నష్టపరిహారం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా సంబంధిత పోలీసు వారి పైన కూడా కఠిన చర్యలు తీసుకోవాలి, ఎఫ్ ఐ ఆర్ చేయమని కంప్లైంట్ రాసి ఇస్తే,బాధితులపైనే కేసు పెట్టిన ఎస్ఐ ని వెంటనే సస్పెండ్ చేయాలి రవి రాజ్ రాథోడ్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

# చదువుకున్న పాఠశాలలోనే సేవా కార్యక్రమాలకు శ్రీకారం

**- విద్యార్థుల తాగునీటి సమస్యకు పరిష్కారం లక్ష్యం**

**- సొంత నిధులతో వాటర్ డ్రమ్ము అందజేసిన**

**- 13వ కాంగ్రెస్ కౌన్సిలర్ మూడు చింతల నరేందర్ రెడ్డి**




గుమ్మడిదల,వాస్తవ తెలంగాణ న్యూస్:

తాను చదువుకున్న పాఠశాలలోనే అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి యువ నాయకత్వానికి నిదర్శనంగా నిలిచారు 13వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ మూడు చింతల నరేందర్ రెడ్డి. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఆయన వెంటనే స్పందించారు. పాఠశాలలో ఉన్న పాత వాటర్ డ్రమ్ము పూర్తిగా పగిలిపోయి నీరు వృథాగా పోతుండగా, ఈ సమస్యపై గత పాలకులు పట్టించుకోలేదని స్థానికులు పేర్కొన్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నరేందర్ రెడ్డి తన సొంత నిధులతో కొత్త వాటర్ డ్రమ్మును కొనుగోలు చేసి, పైప్ లైన్ ఫిట్టింగ్‌తో సహా పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయించారు. దీంతో విద్యార్థుల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. పాఠశాలలో చదువుకున్న తనకు ఈ విద్యాసంస్థపై ప్రత్యేక అనుబంధం ఉందని, చిన్నారుల కోసం ఏ సహాయం చేయడానికైనా సిద్ధంగా ఉంటానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, భవిష్యత్తు కోసం అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ప్రజాప్రతినిధుల బాధ్యత. చిన్న సమస్యైనా వెంటనే పరిష్కరించడమే మా కాంగ్రెస్ పార్టీ విధానం. నిర్లక్ష్య పాలనతో ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తాం” అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రాజు, ఆనంద్ కుమార్, నాగరాజ్, నాయకులు తులసి దాస్, యాదగిరి, పడమటి వెంకటరెడ్డి, మద్దటి మల్లేష్, శ్రీనివాసరెడ్డి, సంతోష్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాహుల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు

# పాపయ్య కుంట కాలుష్య సమస్యపై ప్రజావాణిలో ఫిర్యాదు -

# - హైడ్రా అధికారులకు పరిశీలన ఆదేశాలు









నిజాంపేట్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు..

నిజాంపేట్ సర్కిల్ పరిధిలో తురుక చెరువు నుండి పాపయ్య కుంటకు చేరుతున్న వర్షపు మరియు మరిగినీటి కారణంగా పాపయ్య కుంట తీవ్రంగా కలుషితం అవుతోంది. అదేవిధంగా గుర్రపు డెక్క మరియు పరిసర ప్రాంతాల భూగర్భ జలాలు కూడా కాలుష్యానికి గురవుతూ, దోమల సమస్య పెరుగుతోంది. ఈ పరిస్థితుల వల్ల శ్రీనివాస్ నగర్ కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం రాజధాని స్కూల్ నుండి బండారు లేఔట్ మార్గంగా వెళ్లే ఎస్ఎన్డీపీ (రాచీణ్యా) లైన్‌లో తురుక చెరువు నీటిని మళ్లించాలని కోరుతూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అలాగే హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేయడం జరిగింది. ఇటీవల నిజాంపేట్ కార్పొరేషన్ పాపయ్య కుంట నుండి సిరి బాలాజీ వరకు ఎస్ఎన్డీపీ పనుల కోసం రూ. 3 కోట్ల నిధులు కేటాయించిన నేపథ్యంలో, రాజధాని ప్రాంతంలో అవసరమైన డైవర్షన్ పనులకు ఆ నిధులను వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రంగనాథ్ సార్ సంబంధిత అధికారులకు తక్షణమే హైడ్రా బృందం మరియు సంబంధిత జీహెచ్ఎంసీ ఇరిగేషన్ అధికారులతో కలిసి సంఘటనా స్థలాన్ని సందర్శించి పూర్తి స్థాయి పరిశీలన చేపట్టాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నల్ల జైశంకర్, అరుణ్ రావు, శ్రీరాములు, పులి బలరాం, శ్రీనివాస్ గౌడ్ పాండు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే అండతో రోడ్ల ఆక్రమణ, అక్రమ షెడ్ల నిర్మాణంపై తక్షణ చర్యలు తీసుకోవాలి

**-- ఆకుల సతీష్, నల్ల జైశంకర్**










గాజులరామారం వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు....,

సర్వే నంబర్లు 350, 351( గాజులరామారం )పరిధిలో కైసర్ నగర్‌కు వెళ్లే 30 ఫీట్ల రోడ్డును మరియు దుండిగల్‌కు వెళ్లే 15 ఫీట్ల రోడ్డును ఆక్రమించి అక్రమంగా షెడ్లు నిర్మించిన ఘటనపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ మరియు నల్ల జైశంకర్ డిమాండ్ చేశారు.వారి ఆరోపణల ప్రకారం, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే అండదండలతో అనుమతులు లేకుండా సుమారు 25 అక్రమ షెడ్లు నిర్మించడమే కాకుండా, వాటిలో ఎమ్మెల్యే అనుచరుడికి చెందిన వి లిక్కర్ మార్ట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ విషయమై గత డిసెంబర్ 1 నుండి పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకుండా ఎమ్మెల్యేకు సహకరిస్తున్నారని ఆరోపించారు.

గాజులరామారం డిప్యూటీ కమిషనర్‌ను తొలగించాలని ధర్నా నిర్వహించినప్పటికీ ఇప్పటివరకు రోడ్ల ఆక్రమణలు తొలగించకపోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ నేపథ్యంలో ఈరోజు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేసి, రోడ్లను ఆక్రమించి అనుమతులు లేకుండా నిర్మించిన అక్రమ షెడ్లను తక్షణమే కూల్చివేసి రోడ్లను ప్రజా వినియోగంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.